10న నుమాయిష్‌లో ప్రత్యేక కార్యక్రమాలు

అబిడ్స్,ఫిబ్రవరి 8: గ్లోబల్ కల్చరల్ ఫెస్టివల్ ఆధ్వర్యంలో ఈ నెల 10న నుమాయిష్‌లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జీసీఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ ప్రభాశంకర్, కన్వీనర్ ముఖ్లిర్ హైదర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. హిందుస్థానీ కవి సమ్మేళనం, ముషాయిరాలను నిర్వహిస్తున్నామని, అలాగే సినీనటి జయసుధకు సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ది వాయిస్ ఆఫ్ టాలీవుడ్ సునీత తన మ్యూజికల్‌తో ఆనంద పరచనున్నట్లు వారు వివరించారు.ఎగ్జిబిషన్ లాన్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చైల్డ్‌హోం నుంచి బాలుడు అదృశ్యం

షేక్ రోనక్(ఫైల్)

కాచిగూడ, ఫిబ్రవరి 8: చైల్డ్‌హోం నుంచి ఓ బాలుడు అదృశ్యమయ్యాడు. ఎస్సై సుభాశ్ తెలిపిన ప్రకారం.. ఆసిఫ్‌నగర్‌కు చెందిన షేక్ ఖుర్భాన్ కుమారుడు షేక్ రోనక్(15)ను ముస్కాన్ ఆపరేషన్‌లో భాగంగా జనవరి 30న ఆసిఫ్‌నగర్‌లోని షాపులో పనిచేస్తుండగా పోలీసులు చేరదీసి కాచిగూడ రైల్వే క్వార్టర్స్‌లోని బాయిస్ చైల్డ్ హోంకు తరలించారు. ఈ నెల 2న చైల్డ్‌హోం నుంచి రోనక్ పారిపోయాడు. రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అధికారి యాదయ్య కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నిరుపేదల దహన సంస్కారాలకు చేయూత

అంబర్‌పేట, ఫిబ్రవరి 8 : నిరుపేదల దహన సంస్కారాలకు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అండగా నిలుస్తున్నారు. ప్రతి నెల నిరుపేదలు ఎవరైనా చనిపోతే వారికి ఉచితంగా దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. అందుకు సంబంధించిన రుసుమును ఎమ్మెల్యే హిందూ శ్మశాన వాటిక ప్రబంధక్ కమిటీకి అందజేస్తున్నారు. ఇందులో భాగంగా జనవరి నెలకు సంబంధించి ఉచితంగా నిర్వహించిన 40 మంది దహన సంస్కారాలకు సంబంధించిన రుసుము రూ.2లక్షలు గురువారం శ్మశానవాటిక కార్యదర్శి కుమార్‌కు అందజేశారు. ప్రతి నెల ఎంత మందికి దహన సంస్కారాలు ఉచితంగా చేయిస్తారో ఆ డబ్బును ఎమ్మెల్యే గత మూడేండ్లుగా అందజేస్తున్నారు.

హిందూ శ్మశానవాటిక కార్యదర్శి కుమార్‌కు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

ఎమ్మెల్యే చొరవతో డ్రైనేజీ పైప్‌లైన్ పనులు

కాచిగూడ, ఫిబ్రవరి 8: గోల్నాక డివిజన్‌లోని కృష్ణానగర్, అశోక్‌నగర్ ప్రాంతాల్లో కొన్ని రోజులుగా డ్రైనేజీ నిండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై స్థానిక ప్రజలు గురువారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌ను కలిసి డ్రైనేజీ పైప్‌ను బాగుచేయించాలని కోరగా.. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకుడు సంతోశ్‌కుమార్ జలమండలి సిబ్బందితో డ్రైనేజీ పైప్‌లైన్‌ను బాగుచేయించారు. ఈ కార్యక్రమంలో సురేశ్‌గౌడ్, వినోద్, కృష్ణానగర్, అశోక నగర్, బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా విశ్వకల్యాణ మహోత్సవం

రవీంద్రభారతి, ఫిబ్రవరి 8 : తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక, పర్యాటక శాఖ సౌజన్యంతో విశ్వసృష్టికర్త , విశ్వకర్మల విశిష్టతను విశ్వవ్యాప్తం చేయాలన్న సంకల్పంతో అంతర్జాతీయ సాంస్కృతిక, విశ్వకల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ తల్లి జన్మస్థలమైన పర్వతగిరి మండలంలోని చౌట్‌పల్లి గ్రామానికి చెందిన గిన్నీస్ వరల్డ్ రికార్డ్స్ గ్రహీత శాంతికృష్ణ సేవా సమితి వారు ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన భవనం దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫా వేదికపై జనవరి 27 నుంచి ఫిబ్రవరి వరకు విశ్వకల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించినట్లు నిర్వాహకులు డా.శాంతికృష్ణ ఆచార్య తెలిపారు.ఈ మహోత్సవాలకు డా.రాళ్లబండి లంకేశ్వరాచార్యులు హాజరైనట్లు తెలిపారు. దుబాయ్‌లోని తెలుగు ప్రజలతో పాటు ప్రపంచంలోని అనేక దేశాల ప్రతినిధులు హాజరై విశ్వకల్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేశారని తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన భవనంలో బుర్జ్ ఖలీఫాకు చెందిన ప్రతినిధులు సయ్యద్ మొహమానుద్దీన్ హాజరై అభినందించినట్లు ఆయన తెలిపారు.

నిర్వాహకుడు డా.శాంతికృష్ణను సన్మానిస్తున్న బుర్జ్ ఖలీఫా ప్రతినిధులు

బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రజల్లో ఉండాలి

తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను గతం లో ఎవ్వరూ అందించలేదని, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడు ప్రజల్లో ఉండాలని ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ రావు అన్నారు. గురువారం కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కోడూరి శ్రీధర్‌సాగర్.. ఎమ్మెల్సీని కలిసి సన్మానించారు.

– మెహిదీపట్నం, ఫిబ్రవరి 8

బాధితులకు డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 : ఇండ్లు కోల్పోయిన స్వామి వివేకానంద్ నగర్ బస్తీవాసులకు వారం రోజుల్లో డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించకపోతే బాధితులకు మద్దతుగా ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని బీజేవైఎం నగర పూర్వ అధ్యక్షుడు వినయ్‌కుమార్ హెచ్చరించారు. గాంధీనగర్ డివిజన్‌లోని స్వామి వివేకానంద్‌నగర్ బస్తీలో ఇండ్లు కూల్చడాన్ని నిరసిస్తూ బాధితులు చేపట్టిన నిరాహార దీక్షకు గురువారం ఆయన మద్దతు తెలిపారు. బాధితులు. ఎంబి.కృష్ణ, శ్రావణ్, బాల్‌రాజ్, జాన్, నరేశ్, జ్ఞానేశ్, ఆనంద్, కన్య కుమారిలు, వసంత, తిలక్, ఇందు, పూజ, భారతి, సువర్ణ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పెద్దల కోసమే పేదల ఇండ్లు కూల్చివేత ..

జంటనగరాల్లో పెద్దల కోసమే పేదల ఇండ్లు కూల్చివేస్తున్నారని విముక్తి చిరుతల పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ మండిపడ్డారు. స్వామి వివేకానందనగర్ బస్తీవాసులు చేస్తున్న దీక్షకు ఆయన మద్దతు తెలిపారు. అనంతరం మాట్లాడతూ.. నగరంలోని 300 మురికివాడలను అక్రమంగా కూల్చివేతకు కుట్ర పన్నుతున్నారని ఆయన ఆరోపించారు, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, పులికల్పన,మాల విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బాబు రావు, మచ్చ దేవేందర్ ఆనంద్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద్‌నగర్ బస్తీవాసుల నిరాహార దీక్షలో వినయ్‌కుమార్

స్టివెన్‌సన్‌కు బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డు

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె రూబీ స్టివెన్‌సన్ బహుజన సాహిత్య అకాడమి బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డుకు ఎంపికయ్యారు. బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ గురువారం నగరంలోని బహుజన సాహిత్య అకాడమి కార్యాలయంలో రూబీకి అవార్డుకు ఎంపికైన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 11న ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో నిర్వహించే బహుజన రైటర్స్ 7వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్ సందర్భంగా ఈ అవార్డును అందజేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎం గౌతమ్, రాష్ట్ర కో-ఆర్డినేటర్ హనుమాండ్ల విష్ణు, తదితరులు పాల్గొన్నారు. – అంబర్‌పేట, ఫిబ్రవరి 8

ఆకట్టుకున్న సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకం

చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో మాజీ ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం నిర్వహించిన సత్య హరిశ్చంద్ర పౌరాణిక నాటక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. విశ్రాంత జస్టిస్ బూర్గుల మధుసూదన్ ముఖ్య అతిథిగా పాల్గొని కళాకారుడు డాక్టర్ సులాపాణికి పురస్కారాన్ని అందించి సత్కరించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీహెచ్ త్రినాథరావు, గానసభ పాలకమండలి సభ్యుడు బండి శ్రీనివాస్ పాల్గొన్నారు. – ముషీరాబాద్, ఫిబ్రవరి 8

నీలోఫర్ ఆస్పత్రిలో ఫైరింజన్ ఏర్పాటు

వరుసగా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోవడం, ఎండాకాలం ప్రారంభం కానుండటంతో గురువారం ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ నీలోఫర్ ఆస్పత్రిలో ఫైరింజన్‌ను ప్రారంభించారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాలతో డీఎఫ్ఓ శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో నీలోఫర్‌లో ఫైరింజన్‌ను ఏర్పాటు చేశారు. ఫైర్ ఆఫీసర్ నర్సింహా పాల్గొన్నారు. – ఆబిడ్స్ ఫిబ్రవరి 8

మార్నింగ్ షో పుస్తకావిష్కరణ

సుదీర్ఘకాలంగా సినిమా జర్నలిస్టుగా పనిచేసిన అనుభవాలను, చూసిన సినిమా విశేషాలను వివరిస్తూ జీఆర్ మహర్షి రచించిన 'మార్నింగ్ షో' పుస్తకాన్ని ఆవిష్కరించారు. జమిలి సాహిత్య, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ మా మిడి హరికృష్ణ , సినీ దర్శకుడు సాగర్ కే చంద్ర, కరుణకుమార్, దర్శకురా లు లక్ష్మీసౌజన్య, కవి సిద్ధార్థ్ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి.. రచయితను అభినందించారు. – రవీంద్రభారతి, ఫిబ్రవరి 8

నుమాయిష్‌లో అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

నుమాయిష్‌కు విచ్చేసే సందర్శకులకు సాయంత్రం వేళ ఆహ్లాదపరిచేందుకు గాను ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి. 45 రోజుల పాటు విభిన్న రంగాలకు చెందిన ప్రముఖ కళాకారులతో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇందులో భాగంగా గురువారం గ్లోబల్ కల్చరల్ ఫెస్టివల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు నిర్వహించిన భరతనాట్యం ప్రతి ఒక్కరిని కట్టి పడేసింది. – అబిడ్స్,ఫిబ్రవరి 8

కోటి సంతకాల సేకరణ ..

గోమాతను రాష్ట్ర మాతగా ప్రకటించాలని కోరుతూ భజరంగ్ సేన ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమాన్ని గురువారం రాజేంద్రనగర్ ఉప్పర్ పల్లిలోని సాయిబాబా మందిరంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులు సంతకాలు చేసి.. గోమాతను రాష్ట్ర మాతగా ప్రకటించాలంటూ తమ సంఘీభావాన్ని తెలిపారు. కార్యక్రమంలో సేన అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, సాయిబాబా టెంపుల్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, వైస్ చైర్మన్ ఆంజనేయులు, తెలంగాణ భజరంగ్ సేన సభ్యులు క్రిష్ణాయాదవ్, కాశీ విశ్వనాథ్, అశోక్ కుమార్, వీరేందర్ అవాస్తీ, రామేశ్వర్ మిశ్రా, ఆనంద్ మిశ్రా, రాజారామ్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

– అబిడ్స్,ఫిబ్రవరి 8

త్రైమాసిక ప్రగతి చక్ర పురస్కారాల అవార్డులను అందుకున్న ఉద్యోగులతో హైదరాబాద్ జోన్ ఈడీ పురుషోత్తం నాయక్,ఆర్ఎం శ్రీధర్‌లు

ఉత్తమ సేవలందించే ఉద్యోగులకు గుర్తింపు

సుల్తాన్‌బజార్,ఫిబ్రవరి 8 : సంస్థ అభివృద్ధి కోసం విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించే ఉద్యోగులకు గుర్తింపు వాటంతట అదే వస్తుందని ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం నాయక్ అన్నారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్-2 డిపోలో త్రైమాసిక ప్రగతి చక్ర పురస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన .. రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ శ్రీధర్‌తో కలిసి ఉద్యోగులను ప్రగతి చక్ర పురస్కారాల అవార్డులతో పాటు ప్రశంసాపత్రాలు అందించి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహాలక్ష్మి స్కీంను విజయవంతం చేసినందుకు గాను అభినందనలు తెలిపారు. ఇదే ఉత్సాహంతో నేటి నుండి ప్రారంభమయ్యే మేడారం జాతరను కూడా దిగ్విజయం చేయాలని కోరారు. రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ శ్రీధర్ మాట్లాడుతూ.. రీజియన్ అభివృద్ధితోపాటు సంస్థ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం(ఓ) రాజు, డిప్యూటీ ఆర్ఎం(ఎం) సరిరామ్‌తో పాటు రంగారెడ్డి రీజియన్ డిపో మేనేజర్లు, అవార్డు గ్రహీతలు, సూపర్‌వైజర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో మెరుగైన సేవలు : ఈడీ

కాచిగూడ, ఫిబ్రవరి 8: బస్సుల్లో ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు ఆర్టీసీ సిద్ధంగా ఉందని హైదరాబాద్ ఈడీ వీర్ల వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం కాచిగూడ డిపోలో రీజినల్ స్థాయి త్రైమాసిక పురస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఈడీ హాజరై మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకాన్ని విజయవంతం చేయడంలో ఆర్టీసీ ఉద్యోగుల పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. ఇంధన పొదుపు చేసే సిబ్బందికి, రూట్లలో ఎక్కువ ఆదాయం తెచ్చే వారికి ప్రోత్సాహక బహుమతులను అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ వరప్రసాద్, విజయభాను, సుచరిత, జగన్, డిపో మేనేజర్ రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందికి అవార్డులను అందజేస్తున్న ఈడీ వెంకటేశ్వర్లు, వరప్రసాద్, విజయభాను, సుచరిత, జగన్, తదితరులు

షబ్ ఏ మెరాజ్ ఉత్సవాలు

మెహిదీపట్నం, ఫిబ్రవరి 8 : నానల్‌నగర్ డివిజన్, హకీంపేట్‌లో ఉన్న హకీం బాబా దర్గాలో షబ్ ఏ మెరాజ్ ఉత్సవాలు నిర్వహించారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ పాల్గొని మత పెద్దలను సన్మానించారు. కార్పొరేటర్ నసీరుద్దీన్, నాయకులు మహ్మద్ హరూన్ ఫర్హాన్, అమీ ర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..

కాచిగూడ, ఫిబ్రవరి 8 : పార్టీలకతీతంగా దేశ ప్రజలందరికీ మౌలిక సదుపాయాలను ప్రధాని నరేంద్రమోడీ కల్పిస్తున్నారని సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు అన్నారు. గురువారం కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో కాశీరాంజీరా, బసంత్‌కాలనీ, తదితర ప్రాంతాల్లో బస్తీబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రమేశ్‌యాదవ్, సూర్యప్రకాశ్‌సింగ్, క్షీర్‌సాగర్, భీంరాజ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మెహిదీపట్నం ఫిబ్రవరి 8 : ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన హబీబ్‌నగర్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సీతారాంబాగ్‌లోని విజయ్‌నగర్ టిఫిన్ సెంటర్‌లో వినోద్(35) పని చేస్తున్నాడు. ఇతనికి పెండ్లి కాలేదు. ఈ క్రమంలో జీవితంపై విరక్తితో గురువారం ఉదయం ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాసాబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్‌గా గంగాధర్ బాధ్యతలు

మెహిదీపట్నం, ఫిబ్రవరి 8: ప్రజల శాంతి, భద్రతల పరిరక్షణకు అహర్నిశలు కృషి చేస్తానని మాసాబ్‌ట్యాంక్ పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్ సీహెచ్ గంగాధర్ అన్నారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి అసాంఘీక శక్తుల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తానని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి భయం లేకుండా పోలీసులకు సహకరించాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

వడ్డెర కులస్తులను ఎస్టీజాబితాలో చేర్చాలి..

చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వడ్డెర కులస్తులను ఎస్టీజాబితాలో చేర్చాలని వడ్డెర్ల ఆత్మ గౌరవ భవన సముదాయ ట్రస్ట్ చైర్మన్, వైస్ చైర్మన్ జెరిపేట సత్యనారాయణ రాజు, ఎత్తిరి అంతయ్యలు కోరారు. ఈ మేరకు గురువారం వారు.. రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వ్యవహారాల సలహాదారుడు మహమ్మద్ షబ్బీర్ అలీని కలిసి వినతి పత్రం అందజేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 30 లక్షల మంది ఉన్నామని, 1976 కంటే ముందు వడ్డెర్లతో పాటుగా లంబాడ, ఎరుకల, యానాది, కైకేయ్ అనే కులాలు కూడా డీఎన్‌టీలోనే ఉన్నాయని, 1976 తరువాత లంబాడ,ఎరుకల, యానాది, కైకేయ్ కులాలను ఎస్టీలో చేర్చి, వడ్డెరులను మాత్రం బీసీ జాబితాలో చేర్చి తమకు తీవ్ర అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చి తమకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్లు డాక్టర్ ఓర్సు కృష్ణయ్య, బండారి శ్రీరాములు, మక్కలి వెంకటేశ్, సాయికృష్ణ, రాములు, వెంకట కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి వినతిపత్రం ఇస్తున్న ట్రస్ట్ చైర్మన్, వైస్ చైర్మన్ సత్యనారాయణ రాజు, ఎత్తిరి అంతయ్య

మంచి పనులు చేసి జీవితాన్ని సార్థకం చేసుకోండి

రమణాచారి దంపతులను సత్కరిస్తున్న సాహితీవేత్తలు

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 8: ప్రతి ఒక్కరూ రోజుకొక మంచిపని చేసి జన్మను సార్థకం చేసుకోవాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి పిలుపునిచ్చారు. 72వ జన్మదినాన్ని నఫీజ్‌రెసిడెన్సీలో గల తన కార్యాలయంలో గురువారం ఆత్మీయుల మధ్య రమణాచారి ఘనంగా జరుపున్నారు. తన జన్మదినం సందర్భాన్ని పురస్కరించుకుని భారత్ వికాస పరిషత్ ఆధ్వర్యంలో చౌటుప్పల్‌లో శ్రీరమణ తులసీ వనం పేరిట 72 తులసీ మొక్కలు నాటి.. వాటి పరిరక్షణ బాధ్యతను 'సెయింట్' పాఠశాల విద్యార్థులు తీసుకోవడం పట్ల ఆయన అభినందనలు తెలిపారు. కుత్బుల్లాపూర్‌లోని ఓ పాఠశాల విద్యార్థులు గోపూజ చేసినట్లు రమణాచారి తెలిపారు . సాహితీవేత్తలు సాధన నరసింహాచార్య, సదాశివారెడ్డి, అందెశ్రీ, రఘురామ్, నాగబాల సురేశ్‌కుమార్, సత్యనారాయణ, ఆర్‌సీ రాజు, సంజయ్‌కిషోర్, సతీశ్, తదితరులు రమణాచారి దంపతులను సన్మానించారు.

కుల వృత్తుల ఆపద్బాంధవుడు మాజీ సీఎం కేసీఆర్

కాచిగూడ,ఫిబ్రవరి 8: తెలంగాణలోని బీసీ కుల వృత్తుల కుటుంబాలకు మాజీ సీఎం కేసీఆర్ లక్ష రూపాయలను ఇవ్వడం సహసోపేత నిర్ణయమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గోనె ప్రదీప్‌రావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలోని వెనుబడిన కులవృత్తులు, చేతివృత్తుల వారికి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందించి లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి కష్టపడ్డారని, తెలంగాణ అభివృద్ధికి బృహోత్తర ప్రణాళికలతో ముందుకు కెళ్లారని పేర్కొన్నారు.

రజక వృత్తిదారులను ఆదుకోవాలి..

చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 : రాష్ట్ర ప్రభుత్వం రజక వృత్తిదారులను ఆదుకోవాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశయ్య మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ బంధు పథకానికి దరఖాస్తు చేసిన వృత్తిదారులకు వెంటనే లక్ష ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయాలని అన్నారు. మోడ్రన్ ధోబీగాట్లు ప్రతి మండల కేంద్ర, ప్రతి జిల్లా కేంద్రంలో నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు బాలకృష్ణ, మల్లేశ్, వెంకటేశ్వర్లు, రాములు, గోపాల్, సుభద్ర, రాంబాబు, భాస్కర్ పాల్గొన్నారు.

కేరళ ప్రభుత్వంపై కేంద్రం వివక్ష ..

సీపీఎం పాలిట్ బ్యూరో సభ్యుడు రాఘవులు

కవాడిగూడ, ఫిబ్రవరి 8: కేరళ ప్రభుత్వం పట్ల రాజకీయంగా, ఆర్థికంగా కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతుందని సీఎం పాలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. కేంద్రం అనుసరించే విధానాలు ఫెడరల్ వ్యవస్థనే దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో కేరళ ప్రభుత్వంపై కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రదర్శిస్తున్న వివక్షను నిరసిస్తూ సంఘీభావ ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ.. కేరళ ప్రభుత్వంపై బీజేపీ ప్రభుత్వం ప్రదర్శిస్తున్న తీరును నిరసిస్తూ తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ మద్దతు తెలుపుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి, సీఐటీయూ నాయకులు వీరయ్య, సీతారాములు, నరసింహారెడ్డి, జాన్ వెస్లీ, జ్యోతి, సాగర్ పాల్గొన్నారు.

27 నుంచి సర్టిఫికెట్ కోర్స్ ఇన్ యోగా పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 8: ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) ద్వారా అందించే 'సర్టిఫికెట్ కోర్స్ ఇన్ యోగా పరీక్షా' తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 27వ తేదీ నుంచి నిర్వహించనున్నామని, పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

బీ ఫార్మసీ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 8: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీ ఫార్మసీ పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీ-ఫార్మసీ మొదటి, మూడు, అయిదు, ఏడో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 20వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని అన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహిస్తామని, పరీక్షా తేదీల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్